
బలగం BALAGAM TV

BALAGAM TV DIGITAL NEWS PAPER | balagamtv100@gmail.com

హైదరాబాద్ శనివారం 19 జూలై 2025 | www.balagamtv.com | పేజీలు 4

## రాష్ట్రాలు వివాదరహితంగా ప్రాజెక్టులు కట్టుకోవాలి

- సీపీఐ నాయకులు నారాయణ



బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రాలు వివాదరహితంగా ప్రాజెక్టులు కట్టుకోవాలని సిపిఐ నేత నారాయణ తెలిపారు. ప్రాజెక్టుల విషయంలో కేంద్రం సమావేశం ఏర్పాటు చేయడాన్ని స్వాగతిస్తున్నామని, నీటి అంశాలను కావాలనే రాజకీయం చేస్తున్నారని దుయ్యబట్టారు. శుక్రవారం నారాయణ మీడియాతో మాట్లాడారు. ప్రతి అంశంపై సెంటిమెంట్లతో రెచ్చగొడుతున్నారని, తెలంగాణకు రేవంత్ అన్యాయం చేయలేదన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై విమర్శలు మానుకోవాలని, పెండింగ్ ప్రాజెక్టులు పూర్తి చేయకుండా బనకచర్ల అంశాన్ని తెరపైకి తీసుకొచ్చారని దుయ్యబట్టారు. వెనకబడిన ప్రాంతాలకు నీరు అందే విధంగా ప్రభుత్వాలు కృషి చేయాలన్నారు. ప్రాజెక్టుల నిర్మాణం కోసం కేంద్రం సహాయం తీసుకోవాలని, కొంతమంది ప్రాంతీయ ధోరణితో రెచ్చగొట్టే ప్రయత్నాలు చేస్తున్నారని ధ్వజమెత్తారు. గతంలో బనకచర్ల ప్రాజెక్టు కంటే ముందు హంద్రీనీవా, వంశధర లాంటి ప్రాజెక్టులను పూర్తి చేయాలని నారాయణ డిమాండ్ చేసిన విషయం తెలిసిందే.

# నగరంలో భారీ వర్షం



- చెరవులను తలపించిన రహదారులు
- నగరంలో ఎక్కడికక్కడ ట్రాఫిక్ జామ్‌లు

నవతెలంగాణ-సిటీబ్యూరో

బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో

గ్రేటర్ హైదరాబాద్‌లో పలు చోట్ల కురిసిన భారీ వర్షానికి నగరం అతలాకుతలమైంది. ప్రతిసారీ వర్షానికి నగరంలో ఇబ్బందులు తప్పడం లేదు. రోడ్లన్నీ జలమయంగా మారిపోతున్నాయి. శుక్రవారం మధ్యాహ్నం 3 గంటల నుంచి రాత్రి వరకు కురిసిన వర్షానికి నగరం తడిసి ముద్దయింది. పలు ప్రాంతాలల్లో ప్రధాన రహదారులన్నీ చెరువులను తలపించాయి. ఇండ్లు, దుకాణాలు, షోరూంలలోకి వరద నీరు వచ్చిచేరింది. సికింద్రాబాద్‌తోపాటు పలు ఏరియాల్లోని లోతట్టు ప్రాంతాలు నీటమునిగాయి. బోట్లు సహాయంతో స్థానికులను రక్షించారు. పలు ప్రాంతాలల్లో ట్రాఫిక్ తీవ్రఅంతరాయం ఏర్పడింది. మాదాపూర్ నెక్టార్ గార్డెన్ వద్ద వరద నీరు ఉధృతంగా ప్రవహించింది. మలక్‌పేట్, మూసారంబాగ్‌తోపాటు టోలిచౌకి నానల్ నగర్ జంక్షన్ వద్ద నాలా పొంగిపొర్లింది. సికింద్రాబాద్‌లోని పైగా కాలనీ నీటమునింది. యూసుఫ్‌గూడా,కృష్ణానగర్, నాచారం, ఉప్పల్, మలక్‌పేట్, సికింద్రాబాద్ పలు ప్రాంతాలల్లో మోకాలిలోతు వరద నీరు ప్రవహించింది. షేక్ పేట్, ఖాజాగూడ, రాయదుర్గం, గచ్చిబౌలిలో భారీ వర్షం కారణంగా జనం అవస్థలు పడ్డారు. కొండాపూర్, హఫీజ్ పేట్, మాదాపూర్, మియాపూర్‌లో భారీ వర్షం పడింది. గల్లీలు, రహదారులపై ఎక్కడికక్కడ వర్షపు నీరు నిలిచిపోయింది. ఐటీ కారిడార్‌లో భారీగా ట్రాఫిక్ జామ్ అయింది. దీంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడాల్సివచ్చింది. మెర్క్యూరీ హెూటల్ వద్ద ఓ కారుపై చెట్టు కూలిపోయింది. ఈ ప్రమాదం నుంచి ఇద్దరు మహిళలు సురక్షితంగా బయటపడ్డారు. నాచారంలో భారీ వరద రావడంతో ఆటో కొట్టుకుపోయింది. నాంపల్లిలో ఫర్నీచర్ దుకాణాల్లోకి నీళ్లు రావడంతో

మిగితా 2వ పేజీలో

# రెండు రోజులు భారీ వర్షాలు

### పలు జిల్లాలకు ఎల్లో హెచ్చరిక జారీ

వివరాలు 2వ పేజీలో

## తెలంగాణ

# ప్రాజెక్టులకు అడ్డుపడకండి




- కేసీఆర్ సీఎం అయ్యాకే తెలంగాణ ప్రాజెక్టులకు ఎక్కువ అన్యాయం
- కొల్లాపూర్‌లో యువత కోసం భారీ విద్యా ప్రణాళిక
- ఉద్యోగ భర్తీలలో తెలంగాణకు ప్రత్యేకత
- 60 వేల ఉద్యోగాలు భర్తీ చేసిన ప్రభుత్వం
  - మరో 40 వేలకూ ప్రక్రియ ప్రారంభం
- జటప్రోలు సభలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి
- యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్‌కు శంకుస్థాపన

బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో

తెలంగాణలో అత్యంత కీలకమైన పాలమూరు –రంగారెడ్డి ఎత్తిపోతల పథకంతో పాటు డిండి, కల్వకుర్తి, భీమా, నెట్టెంపాడు, కోయిల్ సాగర్ ప్రాజెక్టులను అడ్డుకోవద్దని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆంధ్రప్రదేశ్ కు విజ్ఞప్తి చేశారు. “తెలంగాణ ప్రాజెక్టులను అడ్డుకోవద్దని విజ్ఞప్తి చేస్తున్నాం. సహకరించాలని కోరుతున్నాం. మా విజ్ఞప్తులను వినకపోతే పోరాటం చేసి సాధించుకుంటాం. నాయకత్వం వహించే బాధ్యత నేను తీసుకుంటా..” అని స్పష్టం చేశారు. ఉమ్మడి రాష్ట్రం ఉన్నప్పుడు పాలమూరును దత్తత తీసుకున్న నారా చంద్రబాబు నాయుడుకి ఇప్పుడు రెండు రాష్టాలు సమంగా, తెలుగు వారు అభివృద్ధి సాధించాలన్న ఆలోచనే నిజమైతే రోజుకు 3 టీఎంసీల నీటిని తరలించే రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టును రద్దు చేయాలని ముఖ్యమంత్రి డిమాండ్ చేశారు.

నాగర్‌కర్నూలు జిల్లా కొల్లపూర్, జటప్రోలులో ప్రతిపాదిత యంగ్ ఇండియా రెసిడెన్షియల్ స్కూల్ నిర్మాణానికి ముఖ్యమంత్రి గారు శంకుస్థాపన చేశారు. ముందుగా అక్కడ మదనగోపాల స్వామి వారి ఆలయం చేరుకుని స్వామి వారి ఆశీర్వాదం తీసుకున్నారు. రెసిడెన్షియల్ స్కూల్ శంకుస్థాపన అనంతరం, మంత్రులు దామోదర రాజనర్సింహ గారు, జూపల్లి కృష్ణా రావు గారు, వాకిటి శ్రీహరి గారు, ఎంపీ మల్లు రవి గారు, ఉమ్మడి జిల్లాకు చెందిన ఎమ్మెల్సీ, ఎమ్మెల్యేలు, స్థానిక ప్రజా ప్రతినిధులు సమక్షంలో జరిగిన “ప్రజా పాలన – ప్రగతి బాట” బహిరంగ సభలో ముఖ్యమంత్రి గారు ప్రసంగించారు. రాష్ట్రంలోని ప్రతిపాదిత నీటి పారుదల ప్రాజెక్టులు, మహిళాభ్యున్నతికి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, ఉద్యోగ నియామకాల వంటి అంశాలను రేవంత్ రెడ్డి గారు ప్రధానంగా ప్రస్తావించారు. తెలంగాణ చేపట్టిన ప్రాజెక్టులను అడ్డుకోవద్దని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు గారికి విజ్ఞప్తి చేస్తూనే అడ్డుపడితే పోరాటం చేస్తామని స్పష్టం చేశారు.

“మా ప్రాజెక్టులను అడ్డుకోవద్దు. అక్కడి సూర్యుడి ఇక్కడ పొడిచినా ప్రాజెక్టులను పూర్తి చేసే బాధ్యత తీసుకుంటాం. పాలమూరు వలసల జిల్లా కాదు. పరిపాలన అందించే జిల్లాగా నిరూపిస్తాం. చంద్రబాబు నాయుడు గారికి మా విజ్ఞప్తి. వారు బాధ్యతగా వ్యవహరించాలి. సహకరించి ఉదారతను చాటుకోవాలి. పాలమూరు – రంగారెడ్డి, డిండి, కల్వకుర్తి, భీమా కోయిల్ సాగర్, నెట్టెంపాడు అన్ని సాగునీటి ప్రాజెక్టుల భూ సేకరణ ప్రక్రియను ఈ ఏడాది డిసెంబర్ 9 నాటికి పూర్తి చేసి అందరికీ నష్ట పరిహారం చెల్లిస్తాం. రాబోయే రెండేండ్లలో ప్రాజెక్టులను పూర్తి చేయాలని లక్ష్యంగా పని చేస్తాం. అలాగే, తుమ్మిడిహెట్టి నుంచి వికారాబాద్, తాండూరు, చేవెళ్ల వరకు నీరు తీసుకొచ్చే బాధ్యతను తీసుకుంటాం.

అధికారం చేపట్టిన మొదటి సంవత్సరంలోనే 60 వేల ఉద్యోగాలు భర్తీ చేశాం. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు దేశంలోనే ఎస్సీ ఉప కులాల వర్గీకరణ పూర్తి చేసిన మొదటి రాష్ట్రం తెలంగాణ. ఎస్సీ ఉపకులాలకు నష్టం వాటిల్లకూడదని వర్గీకరణ ప్రక్రియ పూర్తయ్యాక భర్తీ చేయాలన్న ఉద్దేశంతో కొంతకాలం ఆపి ఇప్పుడు పూర్తి చేయబోతున్నాం. ప్రజా ప్రభుత్వం అధికారం చేపట్టి రెండున్నర సంవత్సరాల కాలం పూర్తయ్యే లోపు మరో 40 వేల ఉద్యోగాలను భర్తీ చేస్తాం. మొత్తంగా లక్ష ఉద్యోగాలను భర్తీ చేసి దేశానికే ఆదర్శంగా, తెలంగాణ మాడల్ ను ఆవిష్కరిస్తాం. విదేశీ పర్యటనల సందర్భంగా దాదాపు 3 లక్షల కోట్ల మేరకు పెట్టుబడులను ఆకర్షించడమే కాకుండా ప్రైవేటు రంగంలో లక్ష ఉద్యోగావకాశాలు కల్పించాం.

అధికారం చేపట్టిన 18 నెలల కాలంలో దేశంలో ఏ రాష్ట్రం చేయలేనన్ని సంక్షేమ పథకాలు మహిళలకు అందించాం. మహిళలను చైతన్యవంతులను చేసి రాష్ట్రాన్ని అభివృద్ధి దిశగా నడిపించాలని లక్ష్యంగా నిర్దేశించాం. తెలంగాణ 2035 నాటికి 1 ట్రిలియన్ డాలర్ ఆర్థిక శక్తిగా ఎదగాలంటే రాష్ట్రంలో కోటి మంది ఆడబిడ్డలను కోటీశ్వరులను చేయాలని సంకల్పించాం..” వెనుకబడిన ప్రాంతమైన కొల్లాపూర్ అభివృద్ధికి సంబంధించి మంత్రి జూపల్లి గారు విజ్ఞప్తులపై సమీక్షించి అవసరమైన నిర్ణయాలు తీసుకోవాలని జిల్లా ఇంచార్జ్ మంత్రి దామోదర రాజనర్సింహ గారికి సూచించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యమంత్రి మహిళా సంఘాలకు వడ్డీ లేని రుణాల కింద 344 కోట్ల రూపాయల చెక్కును అందించారు. అలాగే బ్యాంక్ లింకేజీ, వడ్డీ లేని రుణాలు, ప్రమాద బీమా, లోన్ బీమాలకు సంబంధించిన చెక్కులను అందజేశారు. పలువురు లబ్దిదారులకు ఆహార భద్రత (రేషన్ కార్డులు) కార్డులను అందించారు.

## హాస్టళ్లలో ఏది జరిగినా అధికారులదే బాధ్యత



బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో

గురుకులాలను ఆర్సీవోలు విధిగా తనిఖీ చేయాలని, హాస్టళ్లలో ఏది జరిగినా అధికారులదే బాధ్యతని మంత్రి పొన్నం ప్రభాకర్ వెల్లడించారు. బీసీ గురుకులాల ప్రిన్సిపాల్స్, ఆర్సీవోలు, గురుకుల సెక్రటరీ సైదులు, బీసీ సంక్షేమశాఖ సెక్రటరీ శ్రీధర్‌తో పాటు ఇతర అధికారులతో మంత్రి పొన్నం జూమ్ సమావేశాన్ని శుక్రవారం నిర్వహించారు. ఇటీవల గురుకులాల్లో చోటుచేసుకుంటున్న వరుస ఘటనలపై మంత్రి విచారం వ్యక్తం చేశారు. ఏదైనా అనుకోని సంఘటన జరిగితే వెంటనే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురావాలని, నాణ్యమైన ఆహారం అందించడంలో రాజీపడద్దని ఆదేశించారు. ఉదాసీనంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

## ఔటర్ రింగ్ రోడ్డుపై ఘోర రోడ్డు ప్రమాదం

బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో

రంగారెడ్డి జిల్లా ఆదిబట్ల సమీపంలోని ఔటర్ రింగ్ రోడ్డుపై శుక్రవారం తెల్లవారుజామున తీవ్ర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. ఎగ్జిట్ నంబర్–12 వద్ద ఓ కారు వేగంగా వెళ్తున్న లారీని ఢీకొనడంతో నలుగురు అక్కడికక్కడే మృతి చెందగా, మరొకరు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ కన్నుమూశారు.

గురువారం రాత్రి మొయినాబాద్ సమీపంలోని ఎన్కేపల్లిలోని గ్రీన్ వ్యాలీ రిసార్ట్, సోలార్ విల్లాస్‌లో పని చేస్తున్న ఐదుగురు కారులో యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి దర్శనానికి వెళ్లారు. తిరిగి వస్తుండగా తెల్లవారుజామున 3 గంటల ప్రాంతంలో బొంగులూరు ఎగ్జిట్–12 వద్ద ఈ ఘటన జరిగింది. ఈ ప్రమాదంలో మహబూబాబాద్ జిల్లా గుగులోత్ జనార్దన్(45), వరంగల్ జిల్లాకు చెందిన మాలోత్ చందూలాల్(29), రంగారెడ్డి జిల్లా కావలి బాలరాజు(40), శ్రీకాకుళం జిల్లాకు చెందిన దాసరి భాస్కరరావు(39) అక్కడికక్కడే మృతి చెందారు. తీవ్రంగా గాయపడిన విజయనగరం జిల్లా జడ కృష్ణ(25) ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందారు.

ఘటన స్థలానికి చేరుకున్న ఆదిబట్ల పోలీసులు మృతదేహాలను పోస్టుమార్టం కోసం తరలించారు. ప్రమాదానికి కారుకి అతివేగమే కారణమని ప్రాథమికంగా గుర్తించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు తెలిపారు.



## మా బావను పదేళ్లుగా వేధిస్తున్నారు

- రాహుల్ గాంధీ

బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో

రాబర్ట్ వాద్రా పై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) ఛార్జిషీటు దాఖలు చేసిన సంగతి తెలిసిందే. దీనిపైనే శుక్రవారం రాహుల్ ఎక్స్ వేదికగా స్పందించారు. గత పదేళ్లుగా ఈ కేంద్ర ప్రభుత్వం తన బావను (రాబర్ట్ వాద్రాను) వెంటాడుతూనే ఉందని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ పేర్కొన్నారు. ఈ తాజా ఛార్జిషీటు కూడా ఆ కోవకు చెందినదేనని విమర్శించారు. దురుద్దేశంతో, రాజకీయ కక్షతో పెట్టిన ఈ కేసును ఎదుర్కొనేందుకు రాబర్ట్ వాద్రా, ప్రియాంకల కుటుంబానికి తాను అండగా ఉంటానని రాహుల్ హామీ ఇచ్చారు. ఈసందర్భంగా వీటిని తట్టుకునే ధైర్యం వారందరికీ ఉందని, నిజం ఎప్పటికైనా బయటపడుతుందని ఆయన పేర్కొన్నారు.

వాద్రా కంపెనీ 2008 ఫిబ్రవరిలో శికోహ్‌పుర్‌లో 3.5 ఎకరాల స్థలాన్ని ఓంకారేశ్వర్ ప్రాపర్టీ నుంచి కొనుగోలు చేసింది. దీని విలువ రూ.7.5 కోట్లుగా పేర్కొంది. నాలుగేళ్ల తర్వాత వాద్రా కంపెనీ ఆ భూమిని రియల్ ఎస్టేట్ సంస్థ అయిన డీఎల్ఎఫ్‌కు రూ.58 కోట్లకు విక్రయించింది. ఈ లావాదేవీలపై మనీలాండరింగ్ ఆరోపణలొచ్చాయి. ఈ నేపథ్యంలో 2018లో వాద్రా పేరును ఈడీ ఎఫ్ఐఆర్‌లో చేర్చింది. ఆయనతో పాటు నాటి హరియాణా ముఖ్యమంత్రి భూపిందర్ సింగ్ హుడా, రియల్ ఎస్టేట్ సంస్థ డీఎల్ఎఫ్, ఓ ప్రాపర్టీ డీలర్ పేరును ప్రస్తావించింది.

## అబద్ధపు హామీలతో అధికారంలోకి కాంగ్రెస్



- స్థానిక సంస్థల ఎన్నికల్లో బుద్ధి చెప్పాలి
- నీళ్లు బాబుకు..నిధులు రాహుల్‌కు..
- తెలంగాణ ప్రజలకు బూడిదే
- బనకచర్ల విషయంలో కేంద్రం ముందుకు రావాలి
- టన్నుల కొద్ది కేసులు పెట్టినా.. ఆధారం దొరికిందా?
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో

వంద రోజుల్లో ఆరు గ్యారంటీలు అమలు చేస్తామన్న కాంగ్రెస్ ఏడాదిన్నర గడిచినా ఒక్క హామీ నెరవేర్చలేదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మండిపడ్డారు. రెండు లక్షల ఉద్యోగాల పేరిట యువతను, నాలుగు వేల పెన్షన్ పేరిట వృద్ధులను, 42% రిజర్వేషన్‌ల పేరుతో బీసీలను మోసం చేశారని విమర్శించారు.

ఖమ్మం జిల్లాలో మాజీ మంత్రి పువ్వాడ అజయ్ నివాసంలో జరిగిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో పాల్గొన్న కేటీఆర్, స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్‌కు బుద్ధి చెప్పాల్సిన అవసరం ఉందన్నారు. ప్రజలు మోసపోయిన బాధలో ఉన్నారన్నారు. “ఇప్పుడు ఎన్నికలు జరిగినా కాంగ్రెస్, బీజేపీలకు ఓ నిదర్శనం కనిపిస్తుంది. కేసీఆర్ 100 సీట్లతో తిరిగి అధికారంలోకి వస్తారు” అని ధీమా వ్యక్తం చేశారు. ఖమ్మం జిల్లాకు ముగ్గురు మంత్రులున్నా అభివృద్ధి కనిపించడం లేదని విమర్శించారు. మంత్రి తుమ్మలపై సంచలన వ్యాఖ్యలు చేస్తూ, బాంబుల మాటలు చెప్పే వాళ్లు, బాంబులేట్లు అయ్యారని ఎద్దేవా చేశారు.

నీళ్లు చంద్రబాబుకు.. నిధులు రాహుల్‌కు.. తెలంగాణ ప్రజలకు బూడిదేనని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పాలనను ఉద్దేశించి అన్నారు. ముఖ్యమంత్రి

మిగితా 2వ పేజీలో

# విద్యుత్ ఉత్పత్తి పెంపునకు చర్యలు

- ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క



బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో విద్యుత్ వినియోగానికి డిమాండ్ పెరుగుతున్నందున దానికి తగినట్టుగా ఉత్పత్తి చేయాల్సిన అవసరం ఉందని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారు. 2030 సంవత్సరం వరకు 25వేల మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి చేయాల్సిన అవసరం ఉందని చెప్పారు. నల్లగొండ జిల్లా నాగార్జునసాగర్ పైలాన్ కాలనీలోని ప్రధాన జల విద్యుత్ ఉత్పత్తి కేంద్రాన్ని శుక్రవారం ఆయన సందర్శించారు. పవర్‌హౌస్‌లో ఉత్పత్తి వివరాలను తెలంగాణ సీఎండీ హరీష్ వివరించారు. తెలంగాణ జెన్కో ఉన్నత అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. అనంతరం విజయ విహార్ అతిథి గృహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డిప్యూటీ సీఎం మాట్లాడారు. నాగార్జునసాగర్‌లో విద్యుత్ ఉత్పత్తి చాలా సాంకేతికమైన పరిజ్ఞానంతో ఉన్నదన్నారు. ఆరు దశాబ్దాలకు ముందే ఇక్కడ రివర్స్ పంపింగ్ సిస్టం ఏర్పాటు చేసిన గొప్పతనం కాంగ్రెస్‌దే అని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో రాబోయే రోజుల్లో పరిశ్రమలు, వాణిజ్యంతోపాటు విద్యుత్ ఉత్పత్తిని కూడా పెంచేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. రాష్ట్రంలో రీ ఎనర్జబుల్ విద్యుత్‌తో కాలుష్యాన్ని తగ్గించామన్నారు. మరికొన్ని ఇరిగేషన్ ప్రాజెక్టుల ద్వారా విద్యుత్ ఉత్పత్తి కోసం తగిన చర్యలు తీసుకోవాలని నిర్ణయం తీసుకున్నట్టు తెలిపారు. సోలార్ పవర్ కోసం కూడా అనువైన మార్గాలు అన్వేషిస్తున్నామన్నారు. ఆర్థిక సంపద సృష్టించడం కోసం విద్యుత్ ఉత్పత్తి పెంచే అన్ని రకాల చర్యలూ చేపడతామన్నారు. కొందరు బీఆర్ఎస్ నేతలు అవాకులు చవాకులు పేలుతున్నారని, ఆ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు సాగర్, శ్రీశైలం లాంటి ప్రాజెక్టులు ఏవైనా కట్టారా అని ప్రశ్నించారు. గోదావరిలాంటి పెద్ద నదిపై కూడా ఎలాంటి ప్రయోజనకరమైన ప్రాజెక్టులు కట్టలేకపోయారని ఎద్దేవా చేశారు. సీతారామ ప్రాజెక్టుకు అదనపు నిధులు కేటాయించి వేగవంతం చేశామన్నారు.


బీఆర్ఎస్ నాయకుల భాష సరైంది కాదని, ఒక ముఖ్యమంత్రిని పట్టుకొని సన్యాసి అని మాట్లాడటం వారి భాషా నైపుణ్యానికి తార్కాణమని విమర్శించారు. తెలంగాణ రాష్ట్రానికి రావాల్సిన నీటి వాటాల విషయంలో బీఆర్ఎస్ ప్రభుత్వం అప్పుడు నిద్రపోయిందన్నారు.

మిగితా 2వ పేజీలో

## ఛత్తీస్‌గఢ్‌లో ఎన్‌కౌంటర్

- ఆరుగురు మావోలు మృతి

బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో



ఛత్తీస్‌గఢ్‌లో మరోసారి ఎదురుకాల్పులు చోటు చేసుకున్నాయి. నారాయణ్‌పూర్ జిల్లాలోని అబూజ్‌మడ్ అటవీ ప్రాంతంలో మావోలు, భద్రతా బలగాల మధ్య జరిగిన ఎదురుకాల్పులలో ఆరుగురు మావోయిస్టులు మృతి చెందారు. ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్ర సరిహద్దుల్లో శుక్రవారం మధ్యాహ్నం ఈ ఘటన చోటు చేసుకుంది. మావోయిస్టులు ఉన్నారనే ఇంటెలిజెన్స్ సమాచారంతో పోలీసులు అబూజ్‌మడ్ అటవీ ప్రాంతంలో తనిఖీలు చేపట్టారు. ఈ క్రమంలో మావోలు ప్రతిదాడి చేసేందుకు కాల్పులు జరిపారు. దీంతో ఇరు వర్గాల పరస్పరం కాల్పులు జరుపుకున్నాయి. ఈ ఘటనలో మృతి చెందిన ఆరుగురు మావోల మృతదేహాలతో పాటు భారీగా ఆయుధాలను స్వాధీనం చేసుకున్నారు. ఇందులో ఎకె–47, ఎస్–ఎల్ఆర్ రైఫిల్స్, కొన్ని పేలుడు పదార్థాలు ఉన్నాయని సీనియర్ పోలీసు అధికారి ఒకరు వెల్లడించారు.

# ఎప్‌సెట్‌లో 77,561 మందికి సీట్ల కేటాయింపు

- సీట్లు రాని అభ్యర్థులు 16,793 మంది
- సెల్ఫ్ రిపోర్టింగ్ గడువు 22

బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో ఇంజినీరింగ్, ఫార్మసీ కోర్సుల్లో 2025–26 విద్యాసంవత్సరంలో ప్రవేశాల కోసం ఆన్‌లైన్‌లో నిర్వహించిన ఎప్‌సెట్ (ఎంసెట్) మొదటివిడత కౌన్సెలింగ్ ప్రక్రియలో భాగంగా శుక్రవారం సాంకేతిక విద్యాశాఖ సీట్లు కేటాయించింది. ఈ మేరకు సాంకేతిక విద్యాశాఖ కమిషనర్, ఎప్‌సెట్ ప్రవేశాల కన్వీనర్ శ్రీదేవసేన ఒక ప్రకటన విడుదల చేశారు. రాష్ట్రంలో 95,256 మంది అభ్యర్థులు ఎప్‌సెట్ ఇంజినీరింగ్ ప్రవేశాలకు సంబంధించిన కౌన్సెలింగ్‌లో ధ్రువపత్రాల పరిశీలనకు హాజరయ్యారని తెలిపారు. వారిలో 94,354 మంది అభ్యర్థులు 59,31,279 వెబ్‌ఆప్షన్లను నమోదు చేశారని వివరించారు. రాష్ట్రంలో 172 ఇంజినీరింగ్ కాలేజీల్లో కన్వీనర్ కోటాలో 83,054 సీట్లు అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. ఎప్‌సెట్ మొదటి విడత కౌన్సెలింగ్‌లో 77,561 (93.3 శాతం) మంది అభ్యర్థులకు సీట్లు కేటాయించామని తెలిపారు. ఇంకా 5,493 (6.7 శాతం) సీట్లు మిగిలాయని పేర్కొన్నారు. సరిపోయినన్ని వెబ్‌ఆప్షన్లను నమోదు చేయకపోవడం, ఇతర కారణాల వల్ల 16,793 మందికి సీట్లు కేటాయించలేదని వివరించారు. ఆర్థికంగా వెనుకబడిన తరగతులు (ఈడబ్ల్యూఎస్) కోటా కింద 6,083 మందికి సీట్లు కేటాయించామని తెలిపారు. ఆరు యూనివర్సిటీ, 76 ప్రయివేటు కాలేజీలు కలిపి మొత్తం 82 ఇంజినీరింగ్ కాలేజీల్లో వంద శాతం సీట్లు భర్తీ అయ్యాయని పేర్కొన్నారు. సీట్లు పొందిన అభ్యర్థులు అలాట్‌మెంట్ ఆర్డర్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు. వెబ్‌సైట్‌లో సెల్ఫ్ రిపోర్టింగ్ ద్వారా వివరాలను నమోదు చేసేందుకు ఈనెల 22 వరకు గడువుందని తెలిపారు. ఆన్‌లైన్‌లో ట్యూషన్ ఫీజు చెల్లించాలని కోరారు. సెల్ఫ్ రిపోర్టింగ్ చేయకుంటే సీటు రద్దవుతుందని స్పష్టం చేశారు. ఎప్‌సెట్ తుదివిడతలో సీట్లు కేటాయించిన తర్వాత కాలేజీల్లో రిపోర్టు చేయాలని సూచించారు. ఈనెల 31 నుంచి వచ్చేనెల రెండో తేదీ వరకు జిరాక్స్ ప్రతులను, ఒరిజినల్ టీసీని అందజేయాలని

మిగితా 2వ పేజీలో

# రెండు రోజులు భారీ వర్షాలు

**బలగం టీవీ, హైదరాబాద్**

రాష్ట్రంలో వచ్చే రెండ్రోజులు భారీ వర్షాలు పడే సూచనలున్నాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం ప్రధాన అధికారి డాక్టర్ కె.నాగరత్న హెచ్చరించారు. ఈ మేరకు పలు జిల్లాలకు ఎల్లో హెచ్చరిక జారీ చేశారు. ఆ జాబితాలో సిద్దిపేట, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ మల్కాజిగిరి, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి, మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్, వనపర్తి జిల్లాలున్నాయని తెలిపారు. తెలంగాణ మీదుగా నైరుతు రుతుపవనాలు చురుగ్గా కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. తెలంగాణ మీదుగా బలమైన ఉపరిత గాలులు (గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో) వీచే సూచనలున్నాయని తెలిపారు. మిగతా జిల్లాల్లోనూ పలు ప్రాంతాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు పడే సూచనలు బలంగా ఉన్నాయని పేర్కొన్నారు. జీహెచ్‌ఎంసీ పరిధిలో వచ్చే 48 గంటల పాటు ఆకాశం మేఘావృతమై ఉంటుందనీ, సాయంత్రం, రాత్రి సమ యాల్లో పలు ప్రాంతాల్లో ఈదురుగాలులతో కూడిన మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశముందని తెలిపారు. గ్రేటర్ హైదరాబాద్‌ను వర్షం ముంచెత్తింది. నగరవ్యాప్తంగా విస్తారంగా వాన పడింది. గ్రేటర్‌లో 160కిపైగా ప్రాంతాల్లో వర్షపాతం నమోదైంది. అందులో 54 ప్రాంతాల్లో భారీ వర్షం కురిసింది. రాష్ట్ర వ్యాప్తంగా 75 చోట్ల భారీ వర్షపాతం నమోదైతే అందులో 54 జీహెచ్‌ఎంసీ పరిధిలోనే ఉన్నాయంటేనే వర్ష తీవ్రత ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. శుక్రవారం రాత్రి పది గంటల వరకు రాష్ట్ర వ్యాప్తంగా మొత్తంగా 509 ప్రాంతాల్లో వర్షం కురిసింది. సంగారెడ్డి జిల్లా పుల్కల్ మండల కేంద్రంలో అత్యధికంగా 12.7 సెంటీమీటర్ల వర్షపాతం రికార్డయింది. ఆ తర్వాత రంగారె డ్డి జిల్లా చేవెళ్ల మండలం ధర్మసాగర్‌లో 12.3 సెంటీమీటర్ల వాన పడింది.

# ఎప్‌సెట్‌లో 77,561 మందికి సీట్ల కేటాయింపు

(మొదటి పేజీ తరువాయి)

కోరారు. రిపోర్టు చేయకుంటే సీటు కోల్పోతారని వివరించారు. సెల్ఫ్ రిపోర్టింగ్ చేసి ట్యూషన్ ఫీజు చెల్లిస్తేనే ఎప్‌సెట్ రెండో విడత కౌన్సెలింగ్‌లో పాల్గొనేందుకు అవకాశముంటుందని తెలిపారు. వారే వెబ్‌ఆప్షన్లను నమోదు చేయొచ్చని సూచించారు. రెండో విడతలో సీట్లు పొంది కాలేజీల్లో రిపోర్టు చేయకుంటే తుది విడత కౌన్సెలింగ్‌లో పాల్గొనేందుకు అనుమతి ఉండబోదని వివరించారు. ఇతర వివరాల కోసం https://tgeapcet.nic.in వెబ్‌సైట్‌ను సంప్రదించాలని కోరారు. అయితే మాక్ కౌన్సెలింగ్ సీట్లు పొందిన వారిలో ఇప్పుడు ఎప్‌సెట్ మొదటి విడత కౌన్సెలింగ్ సీట్ల కేటాయింపులో కాలేజీ, బ్రాంచీ మారిన వారు 36,544 మంది ఉన్నారని వివరించారు.

రాష్ట్రంలో ఇంజినీరింగ్ విద్యలో 47 కోర్సులున్నాయి. 23 కోర్సుల్లో వంద శాతం సీట్లు భర్తీ అయ్యాయి. కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్ (సీఎస్‌ఈ), ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ (ఐటీ) అనుబంధ కోర్సులకు భారీగా డిమాండ్ ఉన్నది. ఆ కోర్సుల్లో చేరేందుకు ఎక్కువ మంది అభ్యర్థులు ఆసక్తి కనబరుస్తున్నారు. సీఎస్‌ఈ, ఐటీ అనుబంధ కోర్సుల్లో 58,743 సీట్లుంటే, 57,042 (97.11 శాతం) మందికి సీట్లు కేటాయించారు. ఇంకా 1,700 (2.89 శాతం) సీట్లు మిగిలాయి. ఎలక్ట్రానిక్స్, ఎలక్ట్రికల్ అనుబంధ కోర్సుల్లో 16,112 సీట్లుంటే 14,054 (87.23 శాతం) మందికి సీట్లు కేటాయించారు. 2,058 (12.77 శాతం) సీట్లు మిగిలిపోయాయి.

సివిల్, మెకానికల్ అనుబంధ కోర్సులకు ఆదరణ పెరిగింది. మెటలర్జికల్ ఇంజినీరింగ్, బీటెక్ మెకానికల్ విత్ ఎంటెక్ మాన్యుఫ్యాక్చరింగ్ సిస్టమ్స్, బీటెక్ మెకానికల్ విత్ ఎంటెక్ థర్మల్ ఇంజినీరింగ్, ఏరోనాటికల్ ఇంజినీరింగ్, మెకానికల్ (మెక్ట్రానిక్స్) ఇంజినీరింగ్, ఆటోమొబైల్ ఇంజినీరింగ్, మెటలర్జీ అండ్ మెటీరియల్ ఇంజినీరింగ్ కోర్సుల్లో ఎప్‌సెట్ మొదటి విడత కౌన్సెలింగ్‌లోనే వంద శాతం సీట్లు భర్తీ కావడం విశేషం. సివిల్ ఇంజినీరింగ్‌లో 81.64 శాతం, మెకానికల్ ఇంజినీరింగ్‌లో 74.33 శాతం సీట్లు భర్తీ అయ్యాయి. సివిల్, మెకానికల్ ఇంజినీరింగ్ అనుబంధ కోర్సుల్లో 7,100 సీట్లుంటే, 5,632 (79.32 శాతం) మందికి సీట్లు కేటాయిం చారు. 1,468 (20.68 శాతం) సీట్లు మిగిలాయి. ఇతర ఇంజినీరింగ్ కోర్సులొట్ల 1,100 సీట్లుంటే, 833 (75.73 శాతం) మందికి సీట్లు కేటాయిం చారు. ఇంకా 267 (24.27 శాతం) సీట్లు మిగిలాయి.

# అబద్ధపు హామీలతో అధికారంలోకి కాంగ్రెస్

(మొదటి పేజీ తరువాయి)



రేవంత్‌రెడ్డి, ఆయన పాలనపై నిప్పులు చెరిగారు. కాంగ్రెస్ హయాంలో ప్రతీది నిర్వీర్యం అయిందన్నారు. బనకచర్ల విషయంలో తెలంగాణ ప్రయోజనాలు తాకట్టుపెడితే బీఆర్‌ఎస్ ఊరుకోదని తెలిపారు. 1968 టీఎంసీల నికర, 1950 టీఎంసీల మిగులు జలాలను తేల్చాలని డిమాండ్ చేశారు. ఖమ్మంలోని బీఆర్‌ఎస్ కార్యాలయంలో శుక్ర వారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. వివరాలు కేటీఆర్ మాటల్లోనే..“గుంపు మేస్త్రీ నోట్లో నుంచి కంపు తప్ప.. నికృష్టపు మాటలు తప్ప.. ఏమీ రావు అని తేలిపోయింది. ఒకరోజు ఫోన్ ట్యాపింగ్, మరో రోజు ఫార్ములా ఈ, ఇంకోరోజు డ్రగ్స్, కాదంటే కాళేశ్వరం, లేదంటే కేసీఆర్.. 20 నెలల్లో ఈ రాష్ట్రముఖ్యమంత్రిగా ఉన్న ఆయన కేసీఆర్ జపం చేయటం, డైవర్షన్ ట్యాక్టిక్స్, హెడ్‌లైన్, డెడ్‌లైన్ మేనేజ్‌మెంట్ తప్ప చేసిందేంది. ముఖ్యమంత్రై రెండేండ్లయింది. మీ వల్ల వీసమెత్తయినా లాభం పొందిన మనిషిని గానీ, వర్గాన్ని గానీ చూపెడుతారా..? రేవంత్‌రెడ్డి వల్ల బాగా లాభప డింది ఎవరయ్యా అంటే చిల్లర గాసిప్స్ వెబ్‌సైట్లు, యూట్యూబ్ చానళ్లు, దిక్కుమాలిన థంబ్‌నేల్‌ను నడుపుకునే కొందరు మాత్రమే.. 20 నెలల్లో టన్నుల కొద్దీ కేసులు పెట్టిండు.. గుండుపిన్నంత ఆధారం దొరికిందా? తప్పు చేస్తే కదా.. భయపడటానికి.. మేము ఏమి తప్పు చేయలేదు కాబట్టే.. దమ్ముంటే లై డిటెక్టర్ పరీక్ష పెట్టన్న.. మొదటి రాజకీయ నాయకున్ని నేనే. ఓటుకు నోటు కేసులో డబ్బులు తీసుకోలేదు.. ఇవ్వలేదని.. లై డిటెక్టర్ దగ్గర చెప్పే దమ్ము నీకుందా..?” అంటూ సీఎం రేవంత్‌రెడ్డిపై కేటీఆర్ వ్యాఖ్యానించారు.

ఈమధ్య ఇదిగో పులంటే.. అదిగో తోకనేలా ఫోన్‌ట్యాపింగ్ వ్యవహారం నడుస్తోందని కేటీఆర్ అన్నారు. ఈ హీరోయిన్, ఆ హీరోయిన్, ఈయన డ్రగ్గులు వాడాడు.. ఆయన డ్రగ్గులు వాడాడు.. ఒక్కడంటే ఒక్కడు ఈ ప్రభుత్వంలో వ్యక్తిగానీ, అధికారిగానీ చెప్పారా అని నిలదీశారు. ఫలానా ఆయన ట్యాపింగ్ చేశాడని ఎవరైనా చెప్పారా? ఏంటీ న్యూసెన్స్ అని ప్రశ్నించారు.

అర్ధరాత్రిపోయి నేను లోకేశ్‌ను కలిశానంట..! తాము ఏది చేసినా బాజాప్తుగా చేస్తామని, బేజాప్తుగా చేయాల్సిన కర్మ లేదని కేటీఆర్ అన్నారు. లోకేశ్ ఏమైనా అంతరాష్ట్ర దొంగనా? నీలెక్క సంచులు మోసినోడా? అని సీఎంను ఉద్దేశించి ఆయన ప్రశ్నించారు. లోకేశ్‌ను కలవలేదు.. కలిస్తే తప్పేంటని అన్నారు. లోకేశ్‌తో తనకు సత్సంబంధాలున్నాయని తెలిపారు. ఆరు గ్యారంటీలు మర్చిపోదామా.. 420 దొంగ హామీలు మర్చిపోదామా.. అని ప్రశ్నించారు. ముసలోళ్లకు ఇస్తనన్న రూ.4వేల పెన్షన్, రైతులకు ఇస్తానన్న బోనస్ మర్చిపోదామా అని ప్రశ్నించారు. ‘దుబాయ్‌లో ఎవడో చనిపోతే దాన్ని తనకు అంటగట్టడమేంటి.. రాష్ట్ర ముఖ్యమంత్రివా..? శవాల మీద పేలాలు ఏరుకునే దౌర్భాగ్యుడివా? అని తూలనాడారు.

దొంగతనం చేయటం.. దొరికిపోవటం.. రేవంత్‌రెడ్డి స్పెషాలిటీ అని కేటీఆర్ విమర్శించారు. సీఎం బనకచర్ల అంశమే రాలేదంటాడు.. ఆంధ్రా మంత్రి రామానాయుడు మొదటి అంశమే బనకచర్ల అని చెప్పారు. చంద్రబాబు డైరెక్షన్ ఇచ్చారు.. రేవంత్ ఓకే అన్నడు.. 30 రోజుల్లో కమిటీ వేస్తామని చెప్పిన విషయాన్ని గుర్తు చేశారు. తెలంగాణ ప్రయోజనాలను, గోదావరి జలాలను పూర్తిస్థాయిలో చంద్రబాబుకి తాకట్టుపెట్టారని, దొరికిపోగానే మళ్లీ డైవర్షన్ స్టార్ట్ చేశారని అన్నారు. చిట్‌చాట్‌లో ప్రజలకు పనికొచ్చే ఒక్కమాట కూడా రేవంత్ మాట్లాడలేదని తెలిపారు. తెలంగాణను దండుపాళ్యం బ్యాచ్‌లా దోచుకుంటున్న అనుముల బ్రదర్స్, మీవాళ్లు కలిసి డైవర్షన్ గేమ్‌లు తప్ప చేసిందేంటని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ ప్రభుత్వం వచ్చాక పొంగులేటి శ్రీనివాసరెడ్డికి కొడంగల్ లిఫ్ట్ ఇరిగేషన్‌లో రూ.4వేల కోట్ల ప్రాజెక్టులిచ్చారన్నారు. ‘బడేభాయ్.. చోటేభాయ్ బంధం, బీజేపీ–కాంగ్రెస్ బంధం ఎంత అద్భుతమైనదంటే.. పొంగులేటి ఇంటి మీద ఈడీ రైడ్ అయ్యి సంవత్సరమైనా పొంగులేటి మాట్లాడడు, అటు ఈడీ మాట్లాడడు. పొంగులేటి ఇంటికి నోట్ల కట్టలు అని రాసిన మీడియా వాళ్లు ఎవరూ అడగరే? ఈ నోట్ల కట్టలు ఎక్కడికి పోతున్నాయో మాకు తెలుసు అని అన్నారు. సివిల్ సప్లయిస్ కుంభకోణం, ఈస్టిండియా కంపెనీ అన్న కంపెనీకే కొడంగల్ లిఫ్ట్ ఇరిగేషన్‌లో సగం, మిగతా సగం పొంగులేటికి ఇచ్చారని తెలిపారు. తన సీటుకు ఎవరు ఎసరు పెడతారో అని చెప్పి డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, రెవెన్యూ మంత్రి పొంగులేటి, ఇరిగేషన్ మంత్రి ఉత్తమ్ ఫోన్లు ట్యాప్ చేయటం లేదని నీ మనవడి మీద ఒట్టేసి చెబుతావా? రాష్ట్రంలో వేలాది ఫోన్లు ట్యాప్ చేస్తున్నమాట నిజం కాదా అని ప్రశ్నించారు.

# నగరంలో భారీ వర్షం

(మొదటి పేజీ తరువాయి)

తీవ్రనష్టం వాటిల్లింది. హైదర్‌గూడ రహదారిపై మోకాల్లోతు నీళ్లురావడంతో స్కూటీ నీట మునిగింది. ఇదే తరహాలో పలు ప్రాంతాలల్లో వాహనాలు నీటమునిగిపోయి. పలు ఫ్లైఓవర్ల వద్ద వరద నీరుతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. పీవీ ఎక్స్‌ప్రెస్ భారీగా ట్రాఫిక్‌కు జామైంది.

అవసరమైతేనే బయటకు రావాలి

హైదరాబాద్‌కు వాతావారణ శాఖ ఆరెంజ్ అలర్ట్‌ను ప్రకటించింది. ఈ నేపథ్యంలో అత్యవసరమైతే తప్ప బయటికి రావద్దంటూ జీహెచ్‌ఎంసీ, హైడ్రా అధికారులు నగరవాసులకు సూచనలు చేశారు. జీహెచ్‌ఎంసీ పరిధిలో మరో రెండురోజులపాటు భారీ వర్షాలు పడే అవకాశముందని వాతారణశాఖ హెచ్చరికల నేపథ్యంలో లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలంటూ అధికారులు హెచ్చరించారు. మూసాపేట, అమీర్‌పేట, బేగంపేట, జూబ్లీహిల్స్, పంజాగుట్ట, ఖైరతాబాద్, నాంపల్లి, కోఠీ, చాదర్‌ఘాట్, మలక్‌పేట్, దిల్‌సుశ్‌నగర్, ఎల్బీనగర్, వనస్థలిపురి, హయత్‌నగర్, అబ్దుల్లాపూర్‌మెంట్, ఉప్పల్, రామంతాపూర్, సికింద్రాబాద్, బోయిన్‌పల్లి, మల్లాపూర్, అత్తాపూర్, గండిపేట్, నార్సింగ్‌తోపాటు తదితర ప్రాంతాల్లో భారీ వర్షం కురవడంతో రోడ్లన్నీ నీటితో నిండిపోయాయి. దాంతో కారులు, ద్విచక్ర వాహనాలు నీళ్లలోనే ఉండిపోయాయి. పలువురు వాహనదారులు తీవ్ర ఇబ్బంది పడ్డారు. అప్రమత్తమైన మాన్‌సూన్, డీఆర్‌ఎఫ్ బృందాలు సహాయక చర్యలో పాల్గొన్నారు. సికింద్రాబాద్‌లోని పైగా కాలనీ నీటమునగడంతో హైడ్రా, అగ్నిమాపక బృందాలు కాలనీ వాసులను రక్షించారు. సమీపంలోని దుకాణాల దారులను బోట్ల సహాయంతో బయటకు తీసుకొచ్చారు. స్వయంగా హైడ్రా కమిషనర్ రంగనాథ్ సహాయక చర్యలో పాల్గొన్నారు.


కిలోమీటర్ల మేర నిలిచిపోయిన వాహనదారులు

భారీ వర్షం కారణంగా హైదరాబాద్ లోని రాయదుర్గం, షేక్ పేట్ మార్గంలో 3 కిలోమీటర్ల మేర ట్రాఫిక్ నిలిచిపోయింది. ఆఫీసు నుంచి ఇండ్లకు వెళ్లే సమయం కావడంతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. కొన్ని రోడ్లు నాలాలను తలపించాయి. గచ్చిబౌలి పిజేఆర్ ఫ్లైఓవర్, బయోడైవర్సిటీ, ఐకియా జంక్షన్ వద్ద భారీగా ట్రాఫిక్ జామ్ అయింది. టోలిచౌకి, మెహదీపట్నం మార్గంలో భారీగా ట్రాఫిక్ జామ్‌కావడంతో కిలోమీటరు ప్రయాణానికి గంటకు పైగా సమయం పట్టింది. వరద ప్రవాహానికి వాహనాలు ఎక్కడికక్కడ నిలిచిపోయాయి. ఆర్టీసీ క్రాస్‌రోడ్, అశోక్‌నగర్, గాంధీనగర్, కవాడీగుడా, చిక్కడపల్లి, హిమాయత్‌నగర్ తదితర ప్రాంతాల్లో వర్షం కురవడంతో రోడ్లన్నీ నీటితో నిండిపోయాయి.

# విద్యుత్ ఉత్పత్తి పెంపునకు చర్యలు

(మొదటి పేజీ తరువాయి)

కృష్ణా జలాల విషయంలో రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు కడుతుంటే ఏం చేసిందని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు కుందూరు జయవీర్ రెడ్డి, బత్తుల లక్ష్మారెడ్డి, బాలు నాయక్, జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి, జాయింట్ కలెక్టర్ శ్రీనివాస్, సబ్ కలెక్టర్ నారాయణ అమిత్ పాల్గొన్నారు.




# ఖమ్మం జిల్లాలో బీఆర్‌ఎస్‌కు ఒక్క సీటు రాదు

- **మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి**

**బలగం టీవీ, హైదరాబాద్**

గత ఎన్నికల్లో మాదిరిగానే.. రాబోయే స్థానిక ఎన్నికల్లోనూ ఉమ్మడి ఖమ్మం జిల్లాలో బీఆర్‌ఎస్‌కు ఒక్క సీటు రాదని, రాష్ట్రంలో బీఆర్‌ఎస్‌కు అధికారం దక్కనీయబోమని రెవెన్యూ, హౌసింగ్, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. దీనికి నువ్వైనా.. మీ నాన్న కేసీఆర్ అయినా సిద్ధమా అంటూ.. మంత్రి కేటీఆర్‌కు సవాల్ విసిరారు. శుక్రవారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బూర్గంపాడు మండలంలోని వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆవరణలో నిర్వహించిన ఇందిరమ్మ మహిళా శక్తి సంబురాల్లో మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఖమ్మంలో కేటీఆర్ చేసిన వ్యాఖ్యలపై పొంగులేటి స్పందించారు. గడచిన పదేండ్లలో అక్రమంగా సంపాదించిన సొమ్ముతో ఇతర దేశాల్లో కాలక్షేపం చేయాలనుకుంటే తమకు అభ్యంతరం లేదని, అంతేగానీ జిల్లాలో ముగ్గురు మంత్రులు ఉన్నా ఏమీ చేయలేదని ఆరోపణలు చేస్తే మాత్రం జాగ్రత్త అంటూ హెచ్చరించారు. బీఆర్‌ఎస్ అధికారంలో ఉన్న కాలంలో పేదోడికి ఒక్క రేషన్ కార్డు కూడా ఇవ్వలేదని ఆరోపించారు. డ్వాక్రా మహిళలకు పావలా వడ్డీ రుణాలను ఎగ్గొట్టిన ఏకైక ముఖ్యమంత్రి కేసీఆర్ అని అన్నారు. కేసీఆర్ హయాంలో 60 వేల ఇండ్లు నిర్మిస్తే, కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన ఈ 18నెలల్లో 4 లక్షల ఇండ్ల నిర్మాణాన్ని చేపట్టిందని తెలిపారు. ఇది దొరల ప్రభుత్వం కాదని.. ప్రజల చేత దీవించబడిన ప్రజా ప్రభుత్వమని అన్నారు.

దేశంలో ఎక్కడాలేని విధంగా పేద ప్రజలకు సన్న బియ్యాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం ఇస్తుందని చెప్పారు. దీన్ని చూసి ఓర్వలేకనే.. మాజీ మంత్రి జగదీశ్వర్ రెడ్డి రేషన్ షాపుల వద్ద ప్రజలు క్యూలో ఉంటున్నారని పేర్కొనడం విడ్డూరంగా ఉందని అన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో బెల్ట్ షాపులు వద్ద క్యూలో ప్రజలు ఉంటే కనిపించని మాజీ మంత్రికి సన్న బియ్యం ఇస్తుంటే కనిపిస్తుందా అని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు, జిల్లా కలెక్టర్ జితేష్ వి.పాటిల్, ఐటీడీఏ పీఓ రాహుల్, మాజీ ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మీనారాయణ, డీసీసీబీ డైరెక్టర్ తుళ్లూరు బ్రహ్మయ్య, మాజీ జెడ్పీటీసీ బట్టా విజయ గాంధీ పాల్గొన్నారు.

# మహిళలు వ్యాపారంలోనూ రాణించాలి..

**-కలెక్టర్ సందీప్ కుమార్ ఝా**

**బలగం టీవీ, సిరిసిల్ల**



మహిళలు వ్యాపారంలోనూ రాణించాలని, రాష్ట్రంలోని కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా అన్నారు. ఇందిరా మహిళా సంబరాల్లో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు కలెక్టర్ సందీప్ కుమార్ ఝా జిల్లాలోని ముస్తాబాద్ మండలం ఆవునూరు గాయత్రి గ్రామైక్య సంఘం, ఎల్లారెడ్డిపేటలో చైతన్య గ్రామైక్య సంఘం, కోరుట్లపేటలో భాగ్య శ్రీ గ్రామైక్య సంఘం ఆధ్వర్యంలో ఎరువులు పురుగు మందుల దుకాణాలను ఏర్పాటు చేసి శుక్రవారం వాటిని ప్రారంభించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యం మేరకు ఇందిరా మహిళ శక్తి కింద జిల్లాలోని మహిళా సంఘాలకు ఇప్పటికే క్యాంటీన్లు, డైరీ యూనిట్, కోడి పిల్లల పెంపకం, ఆర్టీసీ బస్సులు ఇతర స్వయం ఉపాధి యూనిట్లను అందజేశామని అన్నారు. త్వరలో రైస్ మిల్లులు, పెట్రోల్ బంక్, సోలార్ ప్లాంట్లు ఏర్పాటు చేయనున్నామని, రైతన్నలకు ఉత్తమ సేవలు అందించేలా మహిళా సంఘాలకు ఎరువులు, పురుగు మందుల దుకాణాలు ఏర్పాటు చేసుకునే అవకాశం కల్పించామని అన్నారు. జిల్లాలో మొత్తం 23 దుకాణాలు మహిళా సంఘాల ఆధ్వర్యలో ఏర్పాటు చేయనున్నామని, ఇందులో భాగంగా ముందుగా 3 ప్రారంభించామని, ఎరువులు, పురుగు మందుల దుకాణాలు ఏర్పాటు రాష్ట్రంలోనే ప్రథమముని అన్నారు. మహిళా సంఘాల బాధ్యులు ప్రణాళిక ప్రకారం నిర్వహించి రైతులకు ఉత్తమ సేవలు అందించాలని నాణ్యమైన విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు అందుబాటులో ఉంచాలని అన్నారు.

రైతులు తమ పరిధిలోని మహిళా సంఘాల ఆధ్వర్యంలో కొనసాగుతున్న ఎరువులు, పురుగు మందుల దుకాణాల్లో ఎరువులు విత్తనాలు, పురుగు మందులు కొనుగోలు చేసి మహిళలకు ఆర్థికంగా మద్దతు పలకాలని పిలుపునిచ్చారు. మహిళా సంఘాల బాధ్యులు ఐక్యంగా తమ దుకాణాలను సమర్థవంతంగా నిర్వహించి ఆర్థికంగా మరింత ఉన్నత స్థానాలకు ఎదగాలని ఆకాంక్షించారు. డీఆర్డీఓ శేషాద్రి, జిల్లా వ్యవసాయ అధికారి అఫ్జల్ బేగం, మార్కెట్ కమిటీ చైర్మన్లు, స్థానిక నాయకులు, మహిళా సంఘాల సభ్యులు రైతులు ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## వేములవాడ ఆలయ రహదారి విస్తరణ పనులను పరిశీలించిన కలెక్టర్

**బలగం టీవీ, వేములవాడ**



వేములవాడ పట్టణంలోని రహదారి విస్తరణ పనులను కలెక్టర్ సందీప్ కుమార్ ఝా శుక్రవారం పరిశీలించారు. వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయ రహదారి విస్తరణ లో బాగంగా గుడి సమీపంలోని రోడ్డు వెంట ఉన్న పలు నిర్మాణాలను అధికారులు శుక్రవారం ఉదయం కూల్చి వేయిస్తుండగా, కలెక్టర్ సందీప్ కుమార్ ఝా పరిశీలించి, అధికారులకు పలు సూచనలు, ఆదేశాలు జారీ చేశారు.రోడ్డు విస్తరణలో భాగంగా కూల్చివేత పనులు చేపడుతున్నారు. ఈ కార్యక్రమంలో వేములవాడ ఆర్డీవో రాధాబాయి, మున్సిపల్ కమిషనర్ అన్వేష్, తహసీల్దార్లు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# కాంగ్రెస్‌లోకి వలసల వెల్లువ

**బీఆర్ఎస్‌ను వీడిన సిరికొండ, తెనుగానిపల్లె నాయకులు**

**బలగం టీవీ, ఇల్లంతకుంట**

ఇల్లంతకుంట మండలం బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్ పార్టీలోకి వలసలు కొనసాగుతున్నాయి. ఇటీవల ఇల్లంతకుంట మండలం తిప్పాపూర్, గాలిపెల్లి, జవారిపేట గ్రామాలకు చెందిన మాజీ సర్పంచులు, బీఆర్ఎస్ నాయకులు భారీగా కాంగ్రెస్ లో చేరిగా, తాజాగా సిరికొండ మాజీ సర్పంచ్ నీలం అంజయ్య, తెనువానిపల్లె మాజీ సర్పంచ్ వంచ అనసూర్య–చంద్రారెడ్డి లు కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. శుక్రవారం ఎల్ఎండీ కాలనీలోని ప్రజాభవన్ లో మానకొండూర్ శాసనసభ్యుడు డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ సమక్షంలో సదరు నాయకులు తమ అనుచరులతో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఎమ్మెల్యేడాక్టర్ కవ్వంపల్లి పార్టీ కండువాలు కప్పి వారందరినీ కాంగ్రెస్ లోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి పాటుపడుతూ రానున్న స్థానిక సంస్థల ఎన్నికలకు సమాయత్తం కావాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలకు ఆకర్షితులై కాంగ్రెస్ పార్టీలో చేరడం సంతోషంగా ఉందన్నారు. పార్టీ కోసం కష్టపడి పని చేసే వారికి సముచిత ప్రాధాన్యత, గుర్తింపు లభిస్తుందన్నారు.

సిరికొండ గ్రామం నుంచి కాంగ్రెస్ పార్టీలో చేరిన వారిలో ఆ గ్రామ మాజీ సర్పంచ్ నీలం అంజయ్య, గంద్ర జగ్గారావు, ఉమ్మరవేణి భూమయ్య, శ్రీను, రాజు, బాలయ్య, గొల్లపల్లి పర్షయ్య, హరీష్, పోచయ్య, తడిచిన రవి, తడిచిన మల్లయ్య, గొడుగు దేవరాజు, కుడుముల ఎల్లయ్య, ఎండీ రంజాన్, అబ్దుల్ షమీ, ఎండీ రియాజ్, పయ్యావుల అజయ్, పయ్యావుల మనోహర్, ఏగుర్ల అనుదీప్ ఉన్నారు. తెనుగువానిపల్లె నుంచి మాజీ సర్పంచ్ వంచ అనసూర్య–చంద్రారెడ్డి, ఉప సర్పంచ్ గొడుగు బాలయ్య, అంజయ్య, మల్లయ్య, లచ్చయ్య, కంకటి స్వామి, మెడుదుల బాలమల్లు, కంసాల మల్లేశం, కంసాల రాజయ్య, కంసాల కనుకయ్య, గురిజాల నవీన్ రెడ్డి, లక్ష్మారెడ్డి, పల్లె రాంచంద్రారెడ్డి, వాడె తిరుపతిరెడ్డి, దుర్గారెడ్డి, గొడుగు దేవయ్య,వంచ శ్రీనివాస్ రెడ్డి, వంచ లక్ష్మారెడ్డి, కంసాల పెద్ద మల్లయ్య, వంచ మల్లారెడ్డి ఉన్నారు. ఈ కార్యక్రమంలో ఇల్లంతకుంట మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కోమటిరెడ్డి భాస్కర్ రెడ్డి, మాడీ ఎంపీపీలు ఊట్కూరి వెంకటరమణారెడ్డి, గుడిసె అయిలయ్య యాదవ్, సింగిల్ విండో మాజీ చైర్మన్ ఐరెడ్డి మహేందర్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ తెనుగువానిపల్లె గ్రామశాఖ అధ్యక్షుడు వరుకోలు మల్లయ్య, నాయకులు పసుల వెంకటి, ఆకుల సత్యనారాయణ, బొల్లవేణి రామేశ్వర్లు, వంచ మల్లారెడ్డి ,ఎండీ సలీం, పల్లె కమలాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# లోకేశ్, జగన్‌లతో కేటీఆర్ రహస్య భేటీ

**మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి**

**బలగం టీవీ, హైదరాబాద్**



బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో ఆయన కుమారుడు, మాజీ మంత్రి కె. తారకరామారావు (కెటిఆర్) టిడిపి నేత నారా లోకేశ్‌తో పాటు అప్పటి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డితో వేర్వేరుగా రహస్య సమావేశాలు నిర్వహించారని కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి ఆరోపించారు. ఫాంహౌస్‌లో జరిగిన ఈ రహస్య మంతనాల వెనుక ఆంతర్యం ఏమిటో బీఆర్ఎస్ నేతలు ప్రజలకు స్పష్టంగా చెప్పాలని డిమాండ్ చేశారు. శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. పదేళ్లపాటు అధికారంలో ఉండి రాజభోగాలు అనుభవించిన బీఆర్ఎస్ నేతలు ఇప్పుడు అధికారం కోల్పోయి మానసికంగా కుదేలయ్యారని వ్యాఖ్యానించారు.

ప్రస్తుతం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాష్ట్రానికి నిధుల కోసం కేంద్రానికి వెళ్లినా.. బీఆర్ఎస్ నేతలు సహనం కోల్పోయి విమర్శలు చేయడం బాధ్యతారాహిత్యానికి నిదర్శనమని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. మాజీ మంత్రి హరీష్ రావును 'పెద్ద నటుడు'గా అభివర్ణించిన జగ్గారెడ్డి.. తమ నేత, మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అసలు నటుడు కాదని.. ఆయన యుద్ధ విమానాలు నడిపిన ఫైటర్ అని కొనియాడారు. కెసిఆర్ ఉన్నంతవరకే కెటిఆర్, హరీష్ రావు ఉన్నట్లు, లేకపోతే వారి ఉనికి ప్రశ్నార్థకమని అన్నారు. ఇదిలా ఉంటే.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో ముఖాముఖి చర్చకు వస్తానంటూ వ్యాఖ్యలు చేసిన కేసీఆర్.. ఇప్పటికీ ముందుకు రాని తీరును జగ్గారెడ్డి విమర్శించారు. అలాగే కేంద్ర మంత్రి బండి సంజయ్ పై విమర్శలు గుప్పించిన ఆయన.. "మీరు నియమించిన కిషన్ రెడ్డి రెండు రాష్ట్రాల ముఖ్యమంత్రులతో సమావేశమయ్యారు. నివేదిక మీకే వస్తుంది కదా? అయినా మరోసారి బహిరంగంగా వివరాలు అడగడం దేనికి సంకేతం?" అని ప్రశ్నించారు.

# నిమిషను క్షేమంగా తీసుకొచ్చేందుకు ప్రయత్నిస్తున్నాం

**- సుప్రీంకోర్టుకు కేంద్రం వివరణ**

**బలగం టీవీ, హైదరాబాద్**

యెమెన్‌లో మరణశిక్ష ఎదుర్కొంటోన్న కేరళ నర్సు నిమిష ప్రియ కేసులో ఆమె భద్రంగా స్వదేశానికి వచ్చేందుకు కేంద్ర ప్రభుత్వం అన్ని విధాలుగా ప్రయత్నిస్తోందని సుప్రీం కోర్టుకు కేంద్రం శుక్రవారం తెలియజేసింది. ఈ కేసుపై తాజాగా అత్యున్నత న్యాయస్థానం మరోసారి విచారణ జరిపింది. ఈ సందర్భంగా ఆమెకు మరణశిక్ష అమలును యెమెన్ తాత్కాలికంగా నిలిపివేసిన విషయాన్ని కేంద్రం జస్టిస్‌లు విక్రమ్‌నాథ్, సందీప్ మెహతాలతో కూడిన ధర్మాసనం దృష్టికి తీసుకెళ్లింది. ఈ కేసులో తమవైపు నుంచి చర్యలు కొనసాగుతున్నాయని కేంద్రం తరపున అటార్నీ జనరల్ ఆర్. వెంకటరమణి కోర్టుకు తెలియజేశారు. నిమిష ప్రియ తరపున న్యాయవాదుల బృందం కోర్టుకు ఓ అభ్యర్థన చేసింది. ఈ కేసులో బాధిత కుటుంబంతో సంప్రదింపులు జరిపేందుకు వీలుగా యెమెన్ వెళ్లేందుకు తమకు అనుమతి ఇవ్వాలని కోరింది. దీనిపై స్పందించిన ధర్మాసనం, ప్రస్తుతం ఆ దేశానికి వెళ్లకుండా ప్రయాణ ఆంక్షలు ఉన్నందున దీనిపై కేంద్ర ప్రభుత్వమే నిర్ణయం తీసుకోవాల్సి ఉందని పేర్కొంది. ఇందుకోసం ప్రభుత్వం వద్ద తమ అభ్యర్థన చేసుకునేలా పిటిషనర్లకు అనుమతి కల్పించింది. అనంతరం ఈ కేసు తదుపరి విచారణను ఆగస్టు 14వ తేదీకి వాయిదా వేసింది. యెమెన్ దేశస్థుడి హత్య కేసులో నిమిష ప్రియకు జులై 16న మరణశిక్ష అమలు చేయాల్సి ఉండగా, చివరి నిమిషంలో అక్కడి ప్రభుత్వం దీన్ని వాయిదా వేసింది. బ్లడ్ మనీపై బాధిత కుటుంబంతో చర్చలు జరిపేందుకు మరింత సమయం ఇవ్వాలని భారత ప్రభుత్వం చేసిన అభ్యర్థనకు ఆ దేశం సానుకూలంగా స్పందించింది. అయితే ఈ బ్లడ్ మనీకి తాము ఎన్నటికీ అంగీకరించబోమని బాధిత కుటుంబం చెబుతోంది. దీంతో ఈ కేసు ఎలా ముగుస్తోందన్న ఉత్కంఠ నెలకొంది.

# జూరాల ప్రాజెక్టుకు భారీ వరద ప్రవాహం..

**18 గేట్లు ఎత్తివేత !**

**బలగం టీవీ, హైదరాబాద్**



ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న భారీ వర్షాల ప్రభావంతో జూరాల ప్రాజెక్టుకు వరద ప్రవాహం కొనసాగుతోంది. ఈరోజు (శుక్రవారం) సాయంత్రం 6 గంటల వరకు ప్రాజెక్టులోకి ప్రవేశిస్తున్న వరద నీటి ప్రవాహం (ఇన్‌ఫ్లో) 1,15,000 క్యూసెక్కులుగా నమోదైంది. వరద తీవ్రతను దృష్టిలో ఉంచుకుని అధికారులు అప్రమత్తమై 18 గేట్లను ఎత్తి నీటిని విడదల చేస్తున్నారు. ప్రస్తుతం స్పిల్‌వే ద్వారా 71,604 క్యూసెక్కులు, పవర్ హౌస్ ద్వారా 30,498 క్యూసెక్కులు నీటిని విడుదల చేస్తున్నారు. భీమా లిఫ్ట్-%క్ష్మీ% ద్వారా 650 క్యూసెక్కులు, కొయిలసాగర్ లిఫ్ట్ ద్వారా 315 క్యూసెక్కులు, నెట్టంపాడు లిఫ్ట్ ద్వారా 750 క్యూసెక్కులు, ఎడమ కాల్వ ద్వారా 1,030 క్యూసెక్కులు, కుడి కాల్వ ద్వారా 600 క్యూసెక్కులు, పారలల్ కెనాల్ (భీమా లిఫ్ట్-II) ద్వారా 700 క్యూసెక్కులు నీటిని విడుదల చేస్తున్నారు. ఇతర డిమాండ్లను కలుపుకుని మొత్తం 1,06,213 క్యూసెక్కుల వరద నీరు ప్రాజెక్టు నుంచి విడుదల అవుతోంది.

# భర్తతో శృంగారానికి నిరాకరిస్తే విడాకులు ఇవ్వొచ్చు

**- బాంబే హైకోర్టు తీర్పు**

**బలగం టీవీ, హైదరాబాద్**

భర్తతో శారీరక సంబంధానికి నిరాకరించడం, ఆయనకు వివాహేతర సంబంధాలు ఉన్నాయని అనుమానించడం క్రూరత్వమేనని, అటువంటి భార్యకు విడాకులు ఇవ్వడానికి ఇవి తగిన కారణాలేనని బాంబే హైకోర్టు తెలిపింది. కుటుంబ న్యాయస్థానం మంజూరు చేసిన విడాకులను సవాల్ చేస్తూ భార్య దాఖలు చేసిన అపీలును హైకోర్టు తిరస్కరించింది. అపీలుదారు (భార్య) ప్రవర్తనను ఆమె తన భర్త పట్ల క్రూరత్వాన్ని ప్రదర్శిస్తున్నట్లుగా అర్థం చేసుకోవచ్చునని తెలిపింది. ఈ దంపతులిద్దరూ 2013లో వివాహం చేసుకున్నారు. 2014 డిసెంబరులో విడిపోయారు. భర్త 2015లో పుణేలోని కుటుంబ న్యాయస్థానాన్ని ఆశ్రయించి, తన భార్య క్రూరత్వం ప్రదర్శిస్తున్నందు వల్ల తమకు విడాకులు మంజూరు చేయాలని కోరారు. వీరిద్దరికీ కోర్టు విడాకులు మంజూరు చేసింది. అయితే తమ వివాహ బంధం తెగిపోవడం తనకు ఇష్టం లేదని భార్య పేర్కొంది. భర్త స్పందిస్తూ, ఆమె తనతో శారీరక సాన్నిహిత్యాన్ని తిరస్కరించిందని, తనకు వివాహేతర సంబంధాలు ఉన్నాయని అనుమానించిందని చెప్పారు.



## కివీస్‌కు రెండో విజయం

**బలగం టీవీ, హరారే**

జింబాబ్వే వేదికగా కొనసాగుతున్న ముక్కోణపు టీ20 సిరీస్‌లో న్యూజిలాండ్ జట్టు అదరగొడుతోంది. శుక్రవారం హరారేలో జరిగిన మ్యాచ్‌లో జింబాబ్వేపై కివీస్ 8 వికెట్ల తేడాతో గెలుపొంది వరుసగా రెండో విజయాన్ని ఖాతాలో వేసుకుంది. ముందుగా బ్యాటింగ్‌కు దిగిన జింబాబ్వే నిర్ణీత 20 ఓవర్లలో 7 వికెట్లు కోల్పోయి 120 పరుగులు చేసింది. మదెవెరె (36) అత్యధిక పరుగులు చేశాడు. న్యూజిలాండ్ బౌలర్లలో మాథ్యూ హెన్రీ 3 వికెట్లు తీయగా, మిల్నె, కెప్టెన్ శాంట్నర్, బ్రాస్‌వెల్, రచిన్ తలో ఒక్కో వికెట్ తీసారు. లక్ష్య ఛేదనలో డెవాన్ కాన్వే (59 నాటౌట్), రచిన్ రవీంద్ర (30) మెరుపులు మెరిపించగా.. కేవలం 13.5 ఓవర్లలోనే కివీస్ విజయతీరాలకు చేరింది. ఈ గెలుపుతో న్యూజిలాండ్ ఫైనల్ చేరే దిశగా బలమైన స్థితిలోకి వెళ్లింది.




## బీసీసీఐకి కాసుల పంట..

### 2023-24లో రూ. 9471 కోట్లు ఆదాయం

**బలగం టీవీ, ముంబై**

భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ)కి మరోసారి కాసుల వర్షం కురిసింది. ప్రపంచంలోని అత్యంత ధనిక క్రికెట్ బోర్డుగా పేరొందిన బీసీసీఐ, 2023–24 ఆర్థిక సంవత్సరానికి గాను ఏకంగా రూ. 9471.7 కోట్ల ఆదాయాన్ని ఆర్జించింది. ఇందులో మెజారిటీ వాటా ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) ద్వారా వచ్చినదే కావడం గమనార్హం. అత్యంత ప్రజాదరణ పొందిన ఐపీఎల్ టోర్నీ బీసీసీఐకి రూ. 5761 కోట్ల మేర ఆదాయం తెచ్చిపెట్టింది. ఇది మొత్తం ఆదాయంలో 59 శాతంగా ఉందని ప్రముఖ బ్రాండింగ్ సంస్థ రెడిఫ్యూషన్ తన తాజా నివేదికలో పేర్కొంది. ఇక మిగతా అంతర్జాతీయ మ్యాచ్‌లు, సిరీస్‌ల మీడియా హక్కుల ద్వారా బోర్డు రూ. 361 కోట్ల మేరకు ఆదాయాన్ని సంపాదించింది. మొత్తంగా బీసీసీఐ ఆదాయ నిల్వలు రూ. 30వేల కోట్లకు చేరుకున్నట్లు సమాచారం. క్రికెట్ కేవలం ఆట మాత్రమే కాకుండా భారీ ఆర్థిక వ్యవహారంగా మారిన దానికి ఇది నిదర్శనమని విశ్లేషకులు చెబుతున్నారు.

## కెప్టెన్‌గా నితీశ్ రెడ్డి

### ఆంధ్ర ప్రీమియర్ లీగ్‌లో భీమవరం బుల్స్‌కు కెప్టెన్

**బలగం టీవీ, హైదరాబాద్**




ఇంగ్లాండ్ పర్యటనలో భారత జట్టుతో ఉన్న ఆల్‌రౌండర్ నితీశ్ కుమార్ రెడ్డి ఆత్మవిశ్వాసంతో రాణిస్తున్నాడు. టెస్టు సిరీస్‌లో బ్యాటింగ్‌లో విశేషంగా కనిపించకపోయినా.. బౌలింగ్‌లో మాత్రం కీలక సమయంలో వికెట్లు తీస్తూ జట్టుకు బ్రేక్ ఇస్తున్నాడు. ఈ క్రమంలోనే నితీశ్‌కు మరో అరుదైన అవకాశం లభించింది. రాష్ట్ర స్థాయిలో నిర్వహించనున్న ఆంధ్ర ప్రీమియర్ లీగ్‌లో భీమవరం బుల్స్ జట్టుకు కెప్టెన్‌గా ఎంపికయ్యాడు. ఇటీవల జరిగిన వేలంలో భీమవరం జట్టు అతడిని కొనుగోలు చేసి, సారథ్యం అప్పగించింది. కేవలం 22 ఏళ్ల వయసులో జట్టుకు కెప్టెన్‌గా ఎంపికవుతూ నితీశ్ అరుదైన ఘనత అందుకున్నాడు. లీగ్ చరిత్రలో రెండో అతి పిన్న వయస్కుడైన కెప్టెన్‌గా నిలిచాడు. నితీశ్‌కి ముందు షేక్ రషీద్ 19 ఏళ్ల వయసులో కెప్టెన్‌గా వ్యవహరించాడు.

ఆంధ్ర ప్రీమియర్ లీగ్ నాల్గో ఎడిషన్ ఆగస్టు 8, 2025 నుంచి ప్రారంభం కానుంది. మొత్తం 7 జటు భీమవరం బుల్స్, అమరావతి రాయల్స్, రాయలసీమ రాయల్స్, కాకినాడ కింగ్స్, తుంగభద్ర వారియర్స్, వైజాగ్ లయన్స్, విజయవాడ సన్‌షైనర్స్ పాల్గొంటున్నాయి. వై.ఎస్. రాజశేఖర రెడ్డి స్టేడియం, విశాఖపట్నం వేదికగా మొత్తం 19 మ్యాచ్‌లు జరగనున్నాయి. ఆగస్టు 24న ఫైనల్ మ్యాచ్‌తో ఈ సీజన్ ముగియనుంది. ఈ సీజన్ కెప్టెన్లు నితీశ్ రెడ్డి (భీమవరం బుల్స్), హనుమ విహారి, కె.ఎస్. భరత్, షేక్ రషీద్, రికీ భూయ్, అశ్విన్ హెబ్బర్ లాంటి ఆటగాళ్లు తమ తమ జట్లకు నాయకత్వం వహించనున్నారు.

## ప్రముఖ హాస్యనటుడు ఫిష్ వెంకట్ కన్నుమూత

**బలగం టీవీ, హైదరాబాద్**





తెలుగు సినీ ప్రేక్షకులను తన ప్రత్యేక హాస్య శైలితో ఆకట్టుకున్న ప్రముఖ నటుడు ఫిష్ వెంకట్ (వెంకట్ రాజ్) ఇక లేరన్న వార్త పరిశ్రమను విషాదంలోకి నెట్టింది. అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన గురువారం ఉదయం హైదరాబాద్‌లోని ఒక ప్రైవేట్ ఆసుపత్రిలో తుదిశ్వాస విడిచారు. ఆయన వయసు 53 సంవత్సరాలు.

గత కొంతకాలంగా కిడ్నీ సంబంధిత వ్యాధితో బాధపడుతున్న ఫిష్ వెంకట్, డయాలసిస్ చికిత్సలో కొనసాగుతూ, ఇటీవల పరిస్థితి విషమించడంతో వెంటిలేటర్‌పై చికిత్స పొందారు. అయితే, వైద్యుల ప్రయత్నాలు ఫలించలేదు.

2000వ దశకంలో 'ఖుషి' సినిమాతో సినీరంగ ప్రవేశం చేసిన వెంకట్, తన సొంత తెలంగాణ యాస, నాటకీయ హావభావాలతో ప్రేక్షకులను నవ్వించాడు. ఆది, బన్నీ, అదుర్స్, గబ్బర్ సింగ్, డీజే టిల్లు వంటి ఎన్నో చిత్రాల్లో కామెడీ, చిన్న విలన్ పాత్రలతో గుర్తింపు సంపాదించాడు. తాజాగా స్లమ్ డాగ్ హస్బెండ్, నరకాసుర, కాఫీ విత్ ఎ కిల్లర్ వంటి చిత్రాల్లోనూ నటించాడు.

ఫిష్ వెంకట్ భార్య సువర్ణ, కుమార్తె స్రవంతితో కలిసి హైదరాబాద్‌లో నివసిస్తున్నారు. ఆయన మరణవార్తతో తెలుగు సినీ పరిశ్రమలో విషాదఛాయలు అలుముకున్నాయి. పలువురు నటులు, దర్శకులు, అభిమానులు సోషల్ మీడియా వేదికగా ఆయనకు ఘన నివాళులు అర్పిస్తున్నారు.

## 14 లోకాలు దాటే కథే విశ్వంభర




**బలగం టీవీ, హైదరాబాద్**

మెగాస్టార్ చిరంజీవి ప్రధాన పాత్రలో నటిస్తున్న భారీ పాన్ ఇండియా చిత్రం 'విశ్వంభర'లిలిపై భారీ అంచనాలు నెలకొన్నాయి. సోషియో–ఫాంటసీ శైలిలో రూపొందుతున్న ఈ చిత్రానికి 'బింబిసార' ఫేమ్ వశిష్ఠ దర్శకత్వం వహిస్తున్నారు. త్రిష కథానాయికగా నటిస్తుండగా, యూవీ క్రియేషన్స్ భారీ బడ్జెట్‌తో ఈ చిత్రాన్ని నిర్మిస్తోంది. ఈ ఏడాది చివర్లో సినిమాను ప్రేక్షకుల ముందుకు తీసుకురావడానికి సన్నాహాలు జరుగుతున్నాయి.

ఈ క్రమంలో, 'విశ్వంభర' కథాంశంపై దర్శకుడు వశిష్ఠ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. "మన పురాణాల ప్రకారం మొత్తం 14 లోకాలు ఉన్నాయి. అందులో పైన 7, కింద 7 ఉంటాయి. ఇప్పటి వరకు ప్రేక్షకులు యమలోకం, స్వర్గలోకం, పాతాళలోకం వంటివి చూశారు. కానీ 'విశ్వంభర'లిలిలో వీటన్నింటినీ దాటి పోయి, బ్రహ్మదేవుడు కొలువై ఉండే సత్యలోకంని చూపించబోతున్నా. ఈ 14 లోకాలకూ మూలమైన సత్యలోకమే మా కథకు కేంద్రబిందువు," అని తెలిపారు. కథపై మరింత వివరంగా చెప్పిన ఆయన, "ఈ సినిమాలో హీరో నేరుగా ఆ సత్యలోకానికి ఎలా వెళ్తాడు? అక్కడి నుంచి హీరోయిన్‌ను ఎలా తీసుకొస్తాడు? అనేదే ఈ కథలో ప్రధాన ఆకర్షణ," అని అన్నారు.

## ప్రముఖ తమిళ దర్శక నటుడు కన్నుమూత

**బలగం టీవీ, హైదరాబాద్**



కోలీవుడ్ లో విషాదం నెలకొంది. ప్రముఖ దర్శక నటుడు వేలు ప్రభాకరన్ కన్నుమూశారు. ఆయన వయసు 68 సంవత్సరాలు. కొంతకాలంగా అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న ఆయన ఆసుపత్రిలో చికిత్స పొందుతూ నిన్న కన్నుమూశారు. ఆదివారం ఆయన అంత్యక్రియలు జరగనున్నాయి. ఆయన మృతి పట్ల సినీ ప్రముఖులు సంతాపం తెలియజేస్తున్నారు. 1980లో వచ్చిన 'ఇవర్గళ్ విత్యసామానవర్గళ్' చిత్రం ద్వారా సినిమాటోగ్రాఫర్ గా పరిచయమయ్యారు. 'నాలయ మనిదన్' సినిమాతో దర్శకుడిగా మారారు. తన సినిమాల ద్వారా సున్నితమైన అంశాలను ఆయన టచ్ చేసేవారు. నటుడిగా కూడా ఆయన మెప్పించారు. పలు చిత్రాల్లో నటించారు. చివరగా గత ఏడాది విడుదలైన 'గజన' మూవీలో ఆయన కనిపించారు. 'కదల్ కాదై' సిని మాలో తనతో కలిసి నటించిన షిర్లే

## రామ్ రాసిన పాట విడుదల

**బలగం టీవీ, హైదరాబాద్**

యంగ్ హీరో రామ్ ప్రధాన పాత్రలో నటిస్తున్న తాజా చిత్రం 'ఆంధ్రాకింగ్ తాలూకా'. ఈ సినిమాకు మహేష్‌బాబు.పి దర్శకత్వం వహిస్తున్నారు. ప్రముఖ నిర్మాణ సంస్థ మైత్రీ మూవీ మేకర్స్ నిర్మిస్తుండగా.. ప్రస్తుతం ఈ చిత్రం శరవేగంగా షూటింగ్ దశలో ఉంది. తాజాగా ఈ చిత్రంలోని తొలి పాట చిత్రబృందం విడుదల చేసింది. ప్రత్యేకత ఏమిటంటే.. ఈ గీతాన్ని హీరో రామ్ స్వయంగా రచించగా, స్టార్ మ్యూజిక్ డైరెక్టర్ అనిరుధ్ రవిచందర్ ఆలపించారు. "ఒక చూపుతో నాలోనే పుట్టిందే.. ఏదో వింతలా గుండెలో చేరిందే.." అంటూ సాగిన ఈ పాట ప్రేమ భావనలకు అద్దం పడుతుంది.




## 'సార్ మేడమ్' ట్రైలర్ విడుదల

### జూలై 25న థియేటర్లలో విడుదల

**బలగం టీవీ, హైదరాబాద్**

తమిళ స్టార్ హీరో విజయ్ సేతుపతి, నేషనల్ అవార్డు విజేత నిత్యా మీనన్ జంటగా నటించిన తాజా చిత్రం 'తలైవన్ తలైవి' తెలుగులో 'సార్ మేడమ్' పేరుతో ప్రేక్షకుల ముందుకు రాబోతోంది. ఈ సినిమాకు ప్రముఖ కుటుంబ కథా చిత్రాల దర్శకుడు పాండిరాజ్ దర్శకత్వం వహించగా, సత్య జ్యోతి ఫిలింస్ బ్యానర్‌పై సెంథిల్ త్యాగరాజన్, అర్జున్ త్యాగరాజన్ నిర్మించారు. జూలై 25న సినిమా విడుదల కానుంది. ఈ నేపథ్యంలో తాజాగా తెలుగు ట్రైలర్‌ను విడుదల చేసింది చిత్రబృందం. ట్రైలర్‌లో విజయ్ సేతుపతి, నిత్యా మీనన్ భార్యాభర్తలుగా కనిపించగా, మొదట్లో ఎంతో అన్యోన్యంగా కనిపించే ఈ జంట మధ్యలో ముదిరిన మనస్పర్థలు, చిన్నచిన్న గొడవలు, వ్యాపార వ్యవహారాలపై ప్రభావం చూపడం వంటి విషయాలు ఆసక్తికరంగా చూపించారు.

అయితే ఈ సీరియస్ అంశాన్ని కూడా దర్శకుడు పాండిరాజ్ తనదైన శైలిలో హాస్యంతో కలిపి నెరవేర్చారు. ఇప్పటి వరకు ఫ్యామిలీ ఎమోషన్స్, గ్రామీణ నేపథ్యంలో హిట్ చిత్రాలు అందించిన పాండిరాజ్ ఈసారి పూర్తిస్థాయి కామెడీతో రావడం విశేషం. విజయ్ సేతుపతి – నిత్యా మీనన్ కెమిస్ట్రీతో పాటు, వినోదానికి ప్రాధాన్యం ఇచ్చే ఈ సినిమా జూలై 25న ప్రేక్షకుల ముందుకు రానుండటంతో భారీ అంచనాలు ఏర్పడ్డాయి.